క్లుప్తంగా

పర్యావరణ పరిరక్షణ పుస్తకావిష్కరణ

టెక్కలి: టెక్కలి ఆదిత్య ఇంజినీరింగ్ కళాశాలకు చెందిన సివిల్ ఇంజినీరింగ్ విభాగం అధ్యాపకురాలు వి.దివ్యశ్రీ రాసిన మున్సిపల్ సాలిడ్ వేస్ట్ మేనేజ్‌మెంట్ (పర్యావరణ పరిరక్షణ) అనే పుస్తకాన్ని శనివారం ఆవిష్కరించారు. కళాశాల డైరెక్టర్ వి.వి.నాగేశ్వరరావు ఆధ్వర్యంలో పుస్తకాన్ని ఆవిష్కరించి అందులో పొందు పరిచిన అంశాలను వివరించారు. ప్రిన్సిపాల్ ఎ.ఎస్.శ్రీనివాసరావు, డీన్‌లు డి.శ్రీరాములు, పి.దినకర్ పాల్గొన్నారు.

దూరవిద్యను సద్వినియోగం చేసుకోవాలి

సోంపేట: పాఠశాల, ఇంటర్మీడియెట్‌లో మధ్యలో చదువును మానేసిన వారు దూర విద్యా విధానం ద్వారా చదువును పూర్తి చేసుకోవచ్చునని మండల విద్యాశాఖాధికారులు ఎస్.జొరాడు, కృష్ణంరాజు పేర్కొన్నారు. విద్యావనరుల కేంద్రంలో శనివారం ప్రధానోపాధ్యాయులు, వెలుగు సిబ్బందితో సమావేశం నిర్వహించారు. సార్వత్రిక విద్యా పీఠం ద్వారా అర్హత గల అభ్యర్థులు దూరవిద్యా విధానాన్ని వినియోగించుకోవాలన్నారు. దీనిపై గ్రామాల్లో అవగాహన కల్పించాలని సూచించారు.

కేజీబీవీ సందర్శన

కవిటి: కొత్తపాలెంలో నిర్వహిస్తున్న కస్తూర్బా గాంధీ విద్యాలయాన్ని సమగ్రశిక్షా అసిస్టెంట్ ప్రాజెక్ట్ కోఆర్డినేటర్ ఎస్.శశిభూషణ్ శనివారం ఆకస్మికంగా సందర్శించారు. ఈ సందర్భంగా విద్యాసంస్థ రికార్డుల్ని తనిఖీ చేశారు. విద్యార్థులతో భేటీ అయ్యారు. ఎంఈవోలు ధనంజయమజ్జి, సనపల రామకృష్ణ పాల్గొన్నారు.

గాయపడిన వ్యక్తి మృతి

టెక్కలి రూరల్: బొప్పాయిపురం పంచాయతీ నీలాపురం గ్రామానికి చెందిన కుప్పిలి శంకర్(40) శ్రీకాకుళం రిమ్స్‌లో చికిత్స పొందుతూ శనివారం మృతి చెందాడు. గత నెల 27 న శాసనం పంచాయతీ కొండభీంపురం వద్ద శంకర్ తన ద్విచక్ర వాహనంపై వెళ్తున్న టి.సూర్యం అనే వ్యక్తిని ఢీకొన్నాడు. ఈ ఘటనలో ఇరువురికీ తీవ్రగాయాలయ్యాయి. గాయపడిన వారిని టెక్కలి జిల్లా ఆస్పత్రికి తరలించారు. అయితే కుప్పిలి శంకర్‌కు తీవ్రగాయాలు కావడంతో శ్రీకాకుళం ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ శనివారం వేకువజామున ఆయన మృతి చెందినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు.

సారాతో వ్యక్తి అరెస్టు

పలాస: కాంట్రగడ గ్రామ సమీపంలో నాటు సారా అమ్ముతుండగా కాశీబుగ్గ ఎక్సైజ్ పోలీసులు శనివారం జారు శంకర్ అనే వ్యక్తిని అరెస్టు చేశారు. అతని వద్ద నుంచి 10 లీటర్ల నాటుసారాని స్వాధీనం చేసుకున్నారు. అతను ఒడిశా రాష్ట్రానికి చెందిన వ్యక్తిగా గుర్తించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ప్రొహిబిషన్ ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్ కె.మల్లికార్జునరావు చెప్పారు.

అక్రమంగా పశువుల రవాణా

మందస: మకరాజోల జాతీయ రహదారిపై పశువులను అక్రమంగా తరలిస్తున్న వాహనాన్ని మందస ఎస్‌ఐ కృష్ణప్రసాద్, సిబ్బంది శనివారం పట్టుకున్నారు. జాతీయ రహదారిపై తనిఖీల్లో భాగంగా మినీ వ్యాన్‌లో 5 గేదెలు అక్రమంగా తరలించాడాన్ని గుర్తించామని ఎస్‌ఐ కృష్ణప్రసాద్ తెలిపారు. వీటిని అలమండ సంతకు తరలిస్తుండగా పట్టుకున్నామని చెప్పారు. వాహనాన్ని సీజ్‌చేసి, పశువులను గోశాలకు అప్పగించామని పేర్కొన్నారు.

నిరుపేద కుటుంబానికి సాయం

టెక్కలి: తిర్లంగి గ్రామానికి చెందిన నిరుపేద ఇప్పిలి కృష్ణారావు బ్రెయిన్ ట్యూమర్‌తో బాధపడుతున్నారు. ఈ విషయం తెలుసుకున్న టెక్కలికి చెందిన అభయం యువజన సేవా సంఘం ఆధ్వర్యంలో ఐదు వేల రూపాయల నగదు, నెలకు సరిపడా నిత్యావసర సరుకులను బాధితుడుకి శనివారం అందజేశారు.

వంశ'ధార' పారలేదు.. నాట్లు పడలేదు!

- సాగు నీటి కోసం రైతన్న ఎదురు చూపు
- వెలవెలబోతున్న సాగునీటి చెరువులు
- ఆగస్టు వచ్చినా వరినాట్లు పడని వైనం



నీరు లేక వెలవెలబోతున్న కిడిసింగి చెరువు



పెదబాడాం వద్ద నీరు లేని వంశధార కాలువ



ఎండిపోతున్న వెద చేనును చూపిస్తున్న రైతులు

వజ్రపుకొత్తూరు రూరల్: దేశానికి వెన్నెముకగా నిలుస్తున్న రైతన్న పంటల సాగుకు అవస్థలు పడుతూనే ఉన్నారు. వరుణుడు కరుణిస్తేనే తప్పా పంట పండని పరిస్థితిని ఎదుర్కొంటున్నారు. అయితే కష్టాలను అధిగమిస్తూనే ఈ ఏడాది కూడా ఎన్నో ఆశలతో ఖరీఫ్ సాగుకు సన్నద్ధమయ్యారు. ఇప్పటికే వేలాది రూపాయలు పెట్టుబడులు పెట్టి వరినారు మడులను సిద్ధం చేశారు. ఉభాలు చేసేందుకు పొలాలను దున్నారు. విత్తనాలు, ఎరువులు, పురుగు మందులు కొనుగోలు చేసి అందుబాటులో పెట్టుకున్నారు. ఇలా అన్నదాతలు వ్యవసాయం చేసేందుకు అవసరమైన అన్ని ఏర్పాట్లు చేసుకున్నాయి. అయితే పంట సాగు చేసేందుకు అవసరమైన సాగు నీరు అందకపోవడంతో ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

పలాస నియోజకవర్గంలో పరిస్థితి ఇలా..

పలాస నియోజకవర్గం పరిధిలోని వజ్రపుకొత్తూరు, పలాస, మందస మండలాల్లో సుమారు 40 వేల ఎకరాల్లో వరి పంటను సాగు చేస్తున్నారు. దీనిలో సుమారు 70 శాతం వరకు వెద పద్ధతిని అనుసరిస్తుంటే మిగిలిన భూమిని ఉభాల పద్ధతిలో సాగు చేస్తున్నారు. ఈ ఏడాది తొలకరి జల్లులు సకాలంలో కురవడంతో ఎన్నో ఆశలతో జూన్ నెల చివరి వారంలోనే విత్తనాలు వేయడం ప్రారంభించారు. ప్రస్తుతం వెదతో పాటు వరినారు మడులు ఎదుగు దశలో ఉంది. ఈ దశలో నీరు తడుపు లేకపోవడంతో వెదతో పాటు నారుమడులు ఎండిపోతున్నాయి. నాట్లు వేసేందుకు వీలుకాక పొలాలు ఖాళీగా దర్శనం ఇస్తున్నాయి.

శివారు ప్రాంత రైతులు ఎదురు చూపులు

కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత పలాస నియోజకవర్గ ఎమ్మెల్యే గౌతు శిరీషతో పాటు కూటమి నాయకులు గత ఏడాది వంశధార రిజర్వాయర్ నుంచి సాగునీరు అందించి ఆర్భాటం చేశారు. కాలువల మరమ్మతులు, పూడికతీత కోసం లక్షలాది రూపాయలు ఖర్చు పెట్టారు. అయితే ఈ ఏడాది మాత్రం సాగునీరు అందించలేక చేతులు ఎత్తేశారు. దీంతో రైతులతో పాటు అన్నివర్గాల ప్రజలు పాలకుల తీరును తప్పుపడుతున్నారు. ప్రధానంగా వజ్రపుకొత్తూరు మండలంలోని కొండవూరు, పాతటెక్కలి, పొల్లాడ, నారాయణపురం, పెద్దబొడ్డపాడు, సీతాపురం, కుర్మానాథపురం, కొల్లిపాడు, కిడిసింగి, తాడివాడ, గుళ్లలపాడు తదితర గ్రామాలకు వంశధార 60 ఆర్‌ఎల్ కుడి, ఎడమ కాలువల ద్వారా శివారు ప్రాంతాలకు సాగు నీరు అందాల్సి ఉంది. అలాగే పలాస మండలంలోని జగన్నాథసాగర్ నుంచి అంతరకుడ్డ, పెద్దబాడాం, గుళ్లలపాడు, తాడివాడ, కిడిసింగి, వజ్రపుకొత్తూరు వరకు దేశ బట్టి ద్వారా ఆయకట్టుకు సాగునీరు చేరాలి. అయితే ఈ ఏడాది ఇప్పటి వరకు చుక్క నీరు అందకపోవడంతో రైతులు ఆందోళనలో పడ్డారు.

వెలవెలబోతున్న చెరువులు

వాస్తవంగా ఈ సమయానికి వంశధార నీటిని చెరువుల్లోకి అధికారులు మళ్లించేవారు. దీంతో నీటితో చెరువులు కళకళలాడేయి. అయితే ఈ సంవత్సరం చుక్కనీరు లేక వెలవెలబోతున్నాయి. ఏడాదికి సరిపడా నీటిని చెరువుల్లో నింపి దీనిపైన రైతులు పంటలసాగుకు ఆధారపడతారు. అయితే చెరువుల్లో చుక్క నీరు లేకపోవడంతో పంటల సాగు పట్ల రైతులు ఆశలు వదులుకుంటున్నారు.

సాగునీరు అందించండి



ఈ ఏడాది ఎన్నో ఆశలతో పంటల సాగుకు సిద్ధమయ్యాయి. మా భూములు వంశధార శివారు ప్రాంతంలో ఉన్నాయి. ఆగస్టు నెల వచ్చినప్పటికీ చుక్క నీరు కూడా అందలేదు. వర్షాలు కూడా లేకపోవడంతో పంటల సాగు పట్ల ఆందోళనగా ఉంది. ఇప్పటికైనా వంశధార నుంచి సాగునీటిని విడుదల చేయాలి.

ఎస్.రాజారావు, రైతు, కిడిసింగి, వజ్రపుకొత్తూరు మండలం

ఆందోళనగా ఉంది



ఏడు ఎకరాలు కౌలుకు తీసుకొని పంటలను సాగు చేస్తున్నాను. ఇప్పటికే వేలాది రూపాయలు ఖర్చుపెట్టి విత్తనాలు, ఎరువులు కొనుగోలు చేశాను. వర్షాలు కురవడం లేదు, వంశధార నీరు అందడం లేదు. కళ్ల ముందే పంటలు ఎండిపోతుంటే ఏమి చేయాలో తోచడం లేదు. ఈ ఏడాది పరిస్థితి ఆందోళనకరంగా ఉంది.

– వంకల ఈశ్వరరావు, కౌలు రైతు, కిడిసింగి, వజ్రపుకొత్తూరు మండలం

పంట ప్రశ్నార్థకమే..



వర్షాలులేక, వంశధార నీరు రాక పంట సాగు ప్రశ్నార్థకంగా మారింది. ఆగస్టు నెల వచ్చినప్పటికీ వరినాట్లు పడని పరిస్థితి. ఈ ఏడాది పంట దిగుబడి పట్ల ఆందోళనగా ఉంది. పాలకులు స్పందించి వంశధార నుంచి సాగు నీరు అందించండి.

–పి.మల్లేష్, రైతు, పెదబాడాం, వజ్రపుకొత్తూరు మండలం

ప్లాస్టిక్ అమ్మకాలు అరికట్టాలని వినతి



కమిషనర్‌కు వినతిపత్రం అందజేస్తున్న గ్రీన్ ఆర్మీ సభ్యులు

కాశీబుగ్గ: పలాస–కాశీబుగ్గ మున్సిపాలిటీ పరిధిలో ప్లాస్టిక్ వినియోగం పెరిగిపోయిందని గ్రీన్ ఆర్మీ అసోసియేషన్ ప్రతినిధులు అన్నారు. తక్షణమే ప్లాస్టిక్ విక్రయాలను అరికట్టాలని కోరారు. ఈ మేరకు మున్సిపల్ కమిషనర్ నడిపేన రామారావును శనివారం కలిసి వినతిపత్రం అందజేశారు. కమిషనర్‌ను కలిసిన వారిలో గ్రీన్ ఆర్మీ అసోసియేషన్ అధ్యక్షులు బోనెల గోపాలరావు, ఉపాధ్యక్షులు పొట్నూరు శ్రీనివాసరావు, ఉపాధ్యాయులు మోస హరినాథ్ ఉన్నారు.

రైతు సంక్షేమమే ధ్యేయం



వజ్రపుకొత్తూరు: రైతులకు డమ్మీ చెక్‌ను అందజేస్తున్న ఎమ్మెల్యే శిరీష



కంచిలి: మాట్లాడుతున్న ఎమ్మెల్యే అశోక్

వజ్రపుకొత్తూరు: రైతు సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యమని పలాస ఎమ్మెల్యే గౌతు శిరీష అన్నారు. పాతటెక్కలి గ్రామంలో వ్యవసాయ శాఖ సహాయ సంచాలకులు ఎం.రామారావు అధ్యక్షతన నియోజకవర్గస్థాయిలో శనివారం నిర్వహించిన అన్నదాత సుఖీభవ- పీఎం కిసాన్ కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. నియోజకవర్గంలో 29,748 మంది రైతులకు రూ.19.816 కోట్లు లబ్ధిచేకూరిందన్నారు. రైతులకు మెగా చెక్కును పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఆర్డీవో వెంకటేష్, ఎంపీడీవో ఎస్.రమేష్‌నాయుడు, ఏవో బి.ధనుంజయరావు, తహసీల్దార్ సీతారామయ్య, పి.ఈశ్వరరావు, పి.విఠల్‌రావు, మాజీ ఎంపీపీలు ఎస్.మోహనరావు, జి.వసంతరావు, దువ్వాడ హేమబాబు చౌదరి పాల్గొన్నారు.

కంచిలి: మండల కేంద్రంలోని వ్యవసాయ మార్కెట్ యార్డు ఆవరణలో అన్నదాత సుఖీభవ నియోజకవర్గ స్థాయి కార్యక్రమాన్ని నిర్వహించారు. ఇచ్ఛాపురం ఎమ్మెల్యే బెందాళం అశోక్ పాల్గొని మాట్లాడారు. మొదటి విడతగా రూ. ఏడు వేలు జమ చేశామని, మరో రెండు విడతల్లో ఏడు, ఆరు వేల రూపాయల చొప్పున రైతుల ఖాతాల్లో జమ చేస్తామన్నారు. కార్యక్రమంలో జనసేన పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి దాసరి రాజు, వ్యవసాయశాఖ ఏడీఏ టి.భవానీ శంకర్, ఇచ్ఛాపురం ఏఎంసీ చైర్మన్ మణిచంద్ర ప్రకాశ్, కంచిలి మండల నేతలు పాల్గొన్నారు.

కవిటి పీఏసీఎస్ సీఈవో మృతి



జానకీరామయ్య(ఫైల్)

కవిటి: స్థానిక ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘం సీఈవో వంజరాన జానకీరామయ్య (55) అనారోగ్యంతో విశాఖలోని ఓ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ శనివారం మృతి చెందారు. ఆయనకు భార్య, కుమారుడు, కుమార్తె ఉన్నారు. జానకీరామయ్య మృతికి ఇచ్ఛాపురం, కంచిలి, సోంపేట పీఏసీఎస్ సీఈవోలు భుజంగరావు, రామారావు, నారాయణరావులు తమ ప్రగాఢ సంతాపాన్ని వ్యక్తం చేశారు.

పశుపోషణలో ముందుండాలి

వజ్రపుకొత్తూరు: పశువులకు సీజనల్‌గా సోకే వ్యాధులు నివారణ, పశుపోషణలో పశువైద్యాధికారులు, సచివాలయ పశుసంవర్ధక శాఖ సహాయకులు ముందుండాలని పశుసంవర్ధక శాఖ టెక్కలి డీడీ డాక్టర్ సీహెచ్ నరసింహులు అన్నారు. గోవిందపురం, పాతటెక్కలి గ్రామీణ పశు వైద్య కేంద్రాలను శనివారం సందర్శించారు. వైద్య సౌకర్యాలు, రైతుల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వ పథకాలపై పాడి రైతులకు అవగాహన కల్పించాలని సూచించారు. పశువులకు సోకే సీజనల్ వ్యాధులకు అందుబాటులో ఉన్న మందులు, ఇతర సౌకర్యాలను పరిశీలించారు. గోవిందపురం పశువైద్యాధికారి పి.మధుబాబు, పాతటెక్కలి ఎల్‌ఎస్‌ఏ పి.లక్ష్మి, ఏహెచ్‌ఏ మల్ల ఈశ్వరరావు ఉన్నారు.

వర్షాలు కురవాలని పూజలు



వర్షాలు కురవాలని ఆకాంక్షిస్తూ టెక్కలి మండలంలోని బూరగాం గ్రామస్తులు శనివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. గ్రామంలోని శివాలయం వద్ద స్వామివారికి ప్రత్యేక పూజలు చేసిన అనంతరం మహిళలు, గ్రామపెద్దలు, యువకులు మంచినీటి చెరువు నుంచి 108 బిందెలతో నీటిని తీసుకొచ్చి శివునికి అభిషేకం చేశారు. –టెక్కలి రూరల్

వేంకటేశ్వరునికి సామూహిక వ్రతాలు



కవిటి మండలం లోళ్లపుట్టుగలోని కల్యాణ వేంకటేశ్వర ఆలయంలో శ్రావణమాసం సందర్భంగా శనివారం సామూహిక వ్రతాలు జరిగాయి. ఆలయ అనువంశిక అర్చకులు అప్పలస్వామి, వెంకటరమణ స్వాముల పర్యవేక్షణలో ఏడు శనివారాల వ్రతకథను శాస్త్రోక్తంగా నిర్వహించారు. అధికసంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

–కవిటి

నేరాలపై అవగాహన



సైబర్ నేరస్తుల బారినపడకుండా ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సోంపేట మండలం బారువ ఎస్సై హరిబాబు నాయుడు అన్నారు. కొర్లాం గ్రామంలో శనివారం సాయంత్రం సైబర్ నేరాలపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. మహిళలకు శక్తి యాప్ గురించి అవగాహన కల్పించారు. యువత చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలన్నారు

–సోంపేట

పింగళి వెంకయ్యకు ఘననివాళి



ఇచ్ఛాపురం రూరల్: పింగళి వెంకయ్యకు జెండాలతో నివాళులు అర్పిస్తున్న విద్యార్థులు



కవిటి: వెంకయ్యకు చిన్నారుల నివాళులు



టెక్కలి: మాట్లాడుతున్న ప్రిన్సిపాల్ గోవిందమ్మ

ఇచ్ఛాపురం రూరల్: ప్రముఖ స్వాతంత్ర్య సమర యోధుడు, భారత జాతీయ పతాక రూపకర్త పింగళి వెంకయ్య మన దేశానికే గర్వకారణమని ప్రధానోపాధ్యాయుడు కొత్తపల్లి సుహాశ్‌చంద్ అన్నారు. పింగళి వెంకయ్య జన్మదినోత్సవం సందర్భంగా శనివారం ఎం.తోటూరు ప్రాథమిక పాఠశాలలో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి విద్యార్థులు, ఉపాధ్యాయులు ఘనంగా నివాళులర్పించారు. దేశానికి ఆయన అందించిన సేవలను మననం చేసుకున్నారు.

కవిటి: పింగళి వెంకయ్య సేవలు అజరామరమైనవని వక్తలు అన్నారు. పెద్ద ఎర్రగోవిందపుట్టుగ పాఠశాలలో నిర్వహించిన కార్యక్రమంలో వెంకయ్య చిత్రపటానికి విద్యార్థులు, ఉపాధ్యాయులు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. కార్యక్రమంలో సిబ్బంది దేవదాస్, మీనా తదితరులు పాల్గొన్నారు.

టెక్కలి: గొప్ప దేశ భక్తుడు పింగళి వెంకయ్య అని టెక్కలి ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ టి.గోవిందమ్మ అన్నారు. కళాశాలలో చరిత్ర విభాగం ఆధ్వర్యంలో పింగళి జయంతి కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి నివాళులర్పించి జీవిత చరిత్రను వివరించారు. వైస్ ప్రిన్సిపాల్ బి.సతీష్‌కుమార్, అధ్యాపకులు వి.ల్యూక్‌పాల్, ఎ.రామారావు, కోటేశ్వరరావు, ఎస్.ధర్మారావు, కె.రెయ్యమ్మ, తిరుమలరావు పాల్గొన్నారు.

తల్లిపాలు అమృతంతో సమానం



ఇచ్ఛాపురం రూరల్: తల్లిపాల ప్రాధాన్యతను వివరిస్తున్న దృశ్యం



పలాస: కార్యక్రమంలో అధికారులు

ఇచ్ఛాపురం రూరల్: తల్లిపాలు అమృతంతో సమానమని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ ఆర్.నీలవేణి అన్నారు. తల్లిపాల వారోత్సవాల సందర్భంగా శనివారం భవానీపురం అంగన్‌వాడీ కేంద్రంలో బాలింతలు, గర్భిణులు, చిన్నారుల తల్లులతో నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. ఈ సందర్భంగా తల్లిపాల ఆవశ్యకతను వివరించారు. అనంతరం గ్రామంలో ర్యాలీ నిర్వహించారు. అంగన్‌వాడీ కార్యకర్త బర్రి నరసమ్మ, చిన్నారుల పేరెంట్స్ పాల్గొన్నారు.

పలాస: అల్లుకోల గ్రామంలో తల్లిపాల వారోత్సవాన్ని నిర్వహించారు. గ్రామ సర్పంచ్ దువ్వాడ వాణాక్షి, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ యు.లత, ఎంఎంఎస్ అధ్యక్షురాలు జి.శాంతమ్మ, అంగన్వాడీ కార్యకర్తలు ఎం.డిల్లేశ్వరి, ఎస్.శాంతి పాల్గొన్నారు. పిల్లలకు తల్లిపాలు ఆవశ్యకతను వివరించారు.

యోజన పథకం కోసం పరిశీలన



వృద్ధాశ్రమాన్ని పరిశీలిస్తున్న జెడ్పీ సీఈవో శ్రీధర్ రాజా తదితరులు

కంచిలి: మండపల్లి గ్రామంలో సీతయ్య ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న వానప్రస్థాశ్రమాన్ని అటల్ వయో అభ్యుదయ్ యోజనా పథకం కోసం జిల్లా పరిషత్ సిఇఓ శ్రీధర్ రాజా ఆధ్వర్యంలో అధికారుల బృందం శనివారం పరిశీలించారు. పరిశీలనలో పలాస డీఎల్‌డీవో రమేష్‌నాయుడు, సోంపేట ఎంపీడీవో ఈశ్వరమ్మ, తహసీల్దార్ బి.అప్పలస్వామి, ఐసీడీఎస్ అధికారులు పరిశీలించి సంతృప్తి చెందారు. వచ్చిన అధికారులకు వృద్ధాశ్రమం వ్యవస్థాపకులు జి.రమేష్, జి.మోహన్ వివరాలు తెలియజేసి సహకరించారు.

రైతు రుణాలపై ఆంక్షలు వద్దు



మాట్లాడుతున్న ఎల్‌డీఎం శ్రీనివాసరావు

ఇచ్ఛాపురం రూరల్ : రైతులు, కౌలు రైతులకు ఆంక్షలు విధించకుండా సాధ్యమైనంత వరకు రుణాలు మంజూరు చూసేందుకు చొరవ చూపాలని జిల్లా బ్యాంకర్స్ ఎల్‌డీఎం పి.శ్రీనివాసరావు అన్నారు. శనివారం ఇచ్ఛాపురం, కవిటి మండలాలకు సంబంధించి అన్ని బ్యాంకుల సిబ్బంది, వ్యవసాయ, సెర్ప్ సిబ్బందితో సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. మహిళా స్వయం శక్తి సంఘాలకు సంబంధించి వారికి కావలసిన సూక్ష్మరుణ ప్రణాళికలు పెండింగ్ లేకుండా అప్రూవల్ ఇచ్చి విరివిగా రుణాలు అందించి వారి జీవనోపాధులు, ఆదాయాభివృద్ధికి తోడ్పాటునందించాలన్నారు. నాబార్డు డీడీఎం రామ్‌లక్ష్మణ్, యూనియన్ బ్యాంకు కన్వీనర్ లీలాన్త్ మిశ్రా, వ్యవసాయాధికారి పి.శ్రీదేవి, ఏపీఎం ఎస్.ప్రసాదరావు పాల్గొన్నారు.



పలాస: మామిడిపల్లిలో కార్యక్రమాన్ని నిర్వహిస్తున్న పార్టీ నాయకులు పైల చిట్టి, ఉంగ సాయి క్రిష్ణ, దువ్వాడ రవి, బమ్మిడి దుర్యోధన తదితరులు



కవిటి: బొరివంకలో ప్రభుత్వ వైఫల్యాలను వివరిస్తున్న సమన్వయకర్త పిరియా విజయ, మండల పార్టీ కన్వీనర్ కె.ప్రకాష్ తదితరులు



సంతబొమ్మాళి: మూలపేటలో చంద్రబాబు మోసాలను ప్రజలకు వివరిస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు



మందస: పొత్తంగి గ్రామంలో కూటమి ప్రభుత్వ వైఫల్యాలను వివరిస్తున్న పార్టీ శ్రేణులు

ఇదేమి పాలన..?



కంచిలి: బూరగాంలో క్యూఆర్ కోడ్ పత్రాలు పంపిణీ చేస్తున్న జెడ్పీ చైర్‌పర్సన్ పిరియా విజయ, ఎమ్మెల్సీ నర్తు రామారావు తదితరులు

రాష్ట్రంలోని కూటమి ప్రభుత్వ ఏడాది పాలన అస్తవ్యస్తంగా మారిందని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులు విమర్శించారు. ఎన్నికల సమయంలో సూపర్‌సిక్స్‌తోపాటు 143 హామీలిచ్చిన ముఖ్యమంత్రి చంద్రబాబు వాటిని అమలు చేయకుండా కాలక్షేపం చేస్తున్నారన్నారు. సంక్షేమం కోసం అడిగితే కేసులతో భయపెడుతున్నారని మండిపడ్డారు. 'బాబు ష్యూరిటీ–మోసం గ్యారెంటీ' కార్యక్రమాన్ని టెక్కలి, ఇచ్ఛాపురం, పలాస నియోజకవర్గాల పరిధిలోని పలు గ్రామాల్లో శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఇంటింటికీ వెళ్లి చంద్రబాబు మోసాలను ప్రజలకు తెలియజేశారు. అలాగే గత వైఎస్సార్ కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో చేసిన అభివృద్ధి, అమలు చేసిన సంక్షేమ పథకాలను వివరించారు.

–సాక్షి నెట్‌వర్క్



ఇచ్ఛాపురం రూరల్: కె.శాసనాంలో చంద్రబాబు మోసాలను వివరిస్తున్న ఎంపీపీ బోర పుష్ప, సీడాప్ మాజీ చైర్మన్ సాడి శ్యామ్‌ప్రసాద్‌రెడ్డి తదితరులు



వజ్రపుకొత్తూరు రూరల్: చీపురపల్లిలో క్యూఆర్ కోడ్‌ను చూపిస్తున్న ప్రజా ప్రతినిధులు, పార్టీ నాయకులు



కాశీబుగ్గ: పలాస-కాశీబుగ్గ మున్సిపాలిటీ 18వవార్డులో కార్యక్రమాన్ని నిర్వహిస్తున్న పట్టణ పార్టీ నాయకులు వైయస్ఆర్‌సిపి నాయకులు



కోటబొమ్మాళి: తిలారు గ్రామంలో కార్యక్రమాన్ని నిర్వహిస్తున్న పార్టీ మండల అధ్యక్షుడు హేమ సుందర్‌రాజు, నాయకులు